manachourasta

# మన చౌరాస్తా

The Complete News way

మన చౌరాస్తా
Telugu News
Channel

సంపుటి : 01 | సంచిక : 208 | శనివారం | 25.01.2025




# పూర్‌పాలనకు గుడ్ బై..!

- 27తో ముగియనున్న జనగామ మున్సిపల్ కౌన్సిల్ గడువు
- ఏం చేశారని సన్మానాలు.. సత్కారాలు!
- కౌన్సిల్ సభ్యులపై పలు విమర్శలు

**మన చౌరాస్తా, జనగామ ప్రతినిధి :**

జనగామ పురపాలక సంఘం పాలక మండలి కాలం ఈ నెల 27తో ముగియనుంది. ఈ నేపథ్యంలో శుక్రవారం కౌన్సిల్ చివరి మీటింగ్ నిర్వహించారు. చివరి మీటింగ్ సందర్భంగా కౌన్సిల్ సభ్యులను ఘనంగా సన్మానించారు. అయితే ఈ సత్కారాలపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. 'అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలో కౌన్సిలర్లుగా వీరు ఏం చేశారని.. సన్మానాలు చేసుకుంటున్నారు..' అని పలువురు విమర్శిస్తున్నారు. ఇక కౌన్సిల్ సభ్యురాలైన 17వ వార్డు కౌన్సిలర్ జక్కుల అనిత వేణుమాధవ్ సైతం ఈ విషయాన్ని కౌన్సిల్‌లో బాహాటంగా అనడం గమనార్హం. ఎజెండాలపై కనీసం చర్చ పెట్టకుండా ఆమోదించుకోవడం సిగ్గుచేటు చివరి మీటింగ్‌లో విరమర్శలు చేశారు. ప్రజల కనీస అవసరాలు తీర్చడంలో ఈ కౌన్సిల్ పూర్తిగా విఫలమైందన్నారు. ఈ పదవి కాలంలో తాను తృప్తిగా పనిచేసిందని లేదని, తనకు అవకాశం ఇచ్చిన వార్డు ప్రజలకు కృతజ్ఞతలతో పాటు క్షమాపణలు తెలిపారు. ఒక పాలకమండలి సభ్యురాలు ఇలాంటి వ్యాఖ్యలు చేశారంటే ఈ ఐదేళ్లలో 'పూర్' పాలన ఎలా సాగిందో అర్థం చేసుకోవచ్చు.

**10 పాలక వర్గాలు.. 14 మంది చైర్మన్లు...**

1952లో జనగామ మున్సిపాలిటీగా అవతరించిన తర్వాత ఇప్పటి వరకు 10 పాలక వర్గాలు ఎన్నిక కాగా 14 మంది చైర్మన్లుగా పని చేశారు. కౌన్సిల్‌కు తొలుత కె.జనార్ధన్ రెడ్డి చైర్మన్‌గా పనిచేయగా.. యాడాది తర్వాత ఆయన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడంతో పదవికి రాజీనామా చేశారు. అసమయంలో దిడిగం రాజలింగం చైర్మన్‌గా పనిచేశారు. ఆ తర్వాత 1959లో రాగి నర్సింహులు, వెన్నం వెంకట నర్సింహారెడ్డి, 1966 కూడా వెన్నం వెంకట నర్సింహారెడ్డి చైర్మన్ అయ్యారు. 1982 నుంచి 1985 వరకు వేరారెడ్డి భాస్కర్ రెడ్డి, ప్రభాకర్, శివ కోటి చైర్మన్లుగా పనిచేశారు. రెండేళ్లు ప్రత్యేక అధికారుల పాలన సాగిన తర్వాత 1987లో దశరథ్, 1992లో ఎర్రమల్ల సుధాకర్, 2000 సంవత్సరంలో డాక్టర్ పగిడిపాటి కరుణాకర్‌రాజు, 2005లో వేమళ్ల సత్యనారాయణరెడ్డి, 2014లో గాడిపెల్లి ప్రేమలతారెడ్డి చైర్‌పర్సన్ అయ్యారు. అయితే ప్రేమలతారెడ్డి పదవీ కాలం ముగిసే సమయంలో ఆమె జడ్పీ ఎన్నికలకు వెళ్లడంతో ఆ సమయంలో వైస్ చైర్మన్‌గా ఉన్న నాగారపు వెంకట్ కొద్ది రోజులు చైర్మన్‌గా కొనసాగారు. 2020లో 30వ వార్డు నుంచి గెలిచిన పోకల జమున చైర్‌పర్సన్ అయ్యారు. అయితే గతంలో బ్లాక్‌గా ఉన్న జనగామ మున్సిపాలిటీగా... ఇప్పుడు జిల్లా కేంద్రంగా మారినా అభివృద్ధి మాత్రం అంతంతే అన్నట్టుగా ఉంది.

## కౌన్సిలర్లే.. కలెక్షన్ ఏజెంట్లు..?

ఇక ఈసారి జనగామ మున్సిపల్ కౌన్సిలర్లు కొందరు పట్టణ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కరించడం కంటే కమీషన్లతో కాలం వెల్లదీశారనే విమర్శలు ఉన్నాయి. మున్సిపాలిటీలో ఏ పని కావాలన్నా వీరి చేయి తడపందే కాదనేది 'జన'మెరిగిన సత్యమే..! మున్సిపాలిటీలో పనిచేస్తున్న అధికారులను తమ ఆదీనంలో ఉంచుకుని తమకు తెలియంది తమ వార్డులో ఏ పని చేయొద్దు అనే విధంగా వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. కొన్ని వార్డుల్లో అభివృద్ధి పేరుతో మున్సిపల్ నిధులను వృథా చేశారనే విమర్శలు ఉన్నాయి. ఇక రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కౌన్సిల్ ఏర్పాటు కావడం.. తర్వాత సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలో రావడం వీరి టర్నమ్‌లో జరిగింది. దీంతో చైర్‌పర్సన్ పోకల జమునపై అసమ్మతి, అవిశ్వాసం.. అంటూ పెద్ద రాద్ధాంతమే జరిగింది. కొన్ని నెలల పాటు అసలు పట్టణాన్ని పట్టించుకున్న పాపాన పోలేదనే విమర్శలు ఉన్నాయి. చివరకు అసమ్మతి చల్ల బడ్డా.. ప్రభుత్వం మారడంతో పాలన మరింత అస్తవ్యస్తంగా తయారై.. తమ ఐదేళ్ల పుణ్య కాలం కాస్తా దగ్గరపడింది.

## ఒక్కరైనా.. మళ్లీ గెలుస్తారా..!

కౌన్సిలర్ల పాలనపై ప్రత్యేకథనం..

- తర్వాతి సంచికలో...



## బాలికా విద్యతో సమాజాభివృద్ధి

3

- జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా



## ప్రజా సేవలో భాగస్వాములు కావాలి

2

- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



## అర్హులందరికీ సంక్షేమ పథకాలు

3

- జనగామ మార్కెట్ చైర్మన్ శివరాజ్



# ప్రజాసేవలో భాగస్వాములు కావాలి

**జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి**

**జనగామ, మన చౌరాస్తా :** పదవీకాలం ముగిసినా మీ అందరూ ప్రజాసేవలో భాగస్వాములు కావాలి.. నిరంతరం ప్రజా సంక్షేమానికి కృషి చేయాలని జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి సూచించారు. జనగామ పట్టణ మున్సిపల్ కౌన్సిలర్లు ఐదేళ్ల పాలన గడువును ముగియనున్న నేపథ్యంలో మున్సిపల్ కార్యాలయం మీటింగ్ హాల్ లో శుక్రవారం ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా గడిచిన ఐదు సంవత్సరాల్లో ప్రజలకు తమ వంతు సహాయ సహకారాలు అందించినందుకు చైర్మన్, కౌన్సిలర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మున్సిపాలిటీలను అభివృద్ధి చేసేందుకు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసిందని గుర్తు చేశారు. మున్సిపాలిటీ అభివృద్ధికి పాలకవర్గ సభ్యులు ఐదేళ్లుగా నిరంతరం కృషి చేశారన్నారు. పదవితో సంబంధం లేకుండా ప్రజాసేవలో నిరంతరం ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జమునతో పాటు అన్ని వార్డుల కౌన్సిలర్లు పాల్గొన్నారు.




జనగామ మున్సిపల్ కౌన్సిల్ ఐదేళ్ల కాలం పూర్తయిన నేపథ్యంలో కౌన్సిలర్లను సన్మానించిన డాక్టర్ సుధా సుగుణాకర్ రాజు

## ఆరోగ్యంగా ఉండాలంటే

# తరచూ రక్తదానం చేయాలి

**జనగామ, మన చౌరాస్తా :** ఆరోగ్యంగా ఉండాలని కోరుకునే ప్రతి ఒక్కరూ తరచూ రక్తదానం చేయడం అలవాటు చేసుకోవాలని జనగామ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఏ.బాలకృష్ణ అన్నారు. ఆల్ ఇండియా కెమిస్ట్స్ అండ్ డ్రగిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్నాథ్ లక్ష్మీబాయి సకారామ్ షిండే 75 వ జన్మదినోత్సవం సందర్భంగా భారత దేశ వ్యాప్తంగా నిర్వహించిన రక్త దాన కార్యక్రమంలో భాగంగా జనగామ జిల్లా కెమిస్ట్స్ అండ్ డ్రగిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్వప్న ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన రక్త దాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ ఈరోజు రక్తదానం చేసిన దాతలను ఆయన అభినందించారు. రక్తదానం చేయడం వల్ల శరీరంలోని శుద్ధి జరిగి ఆరోగ్యవంతంగా ఉంటామని, యువకులలో ఉన్న అపోహలు తొలగించుకోవాలని




ఆయన సూచించారు. కెమిస్ట్స్ అసోసియేషన్ కార్య నిర్వహకులచే మొదలైన శిబిరంలో 88 యూనిట్ల రక్తదానం చేసినట్లు రక్త నిధి అధికారి డా. పి.కరుణాకర్ రాజు తెలిపారు. రెడ్ క్రాస్, లయన్స్ క్లబ్ ల ప్రతినిధులు, ఐ.ఎం.ఏ. వైద్యులు పాల్గొన్న ఈ శిబరంలో వైద్య ప్రముఖులు డా. పి. సుగుణాకర్ రాజు, ఐ ఎం.ఏ. జనగామ అధ్యక్షులు డా. జే. బాలాజీ, రక్త నిధి సహాయ వైద్యాధికారి డా. పేర్వారం దివ్య , రెడ్ క్రాస్ సొసైటీ జనగామ జిల్లా కార్యదర్శి కన్న పరశురాములు, కెమిస్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మెరుగు దేవరాజ్ , కార్యదర్శి యాంసాని కృష్ణ, కోశాధికారి దోర్నాల వెంకటేశ్వర్లు, కెమిస్ట్స్ అసోసియేషన్ జనగామ పట్టణ కమిటీ అధ్యక్షుడు బి.ఆంజనేయులు, కార్యదర్శి బుక్క బాల భరద్వాజ్ , కోశాధికారి కొలుపుల యాదగిరి పాల్గొన్నారు.



# ప్రజలకు, అధికారులకు కృతజ్ఞతలు

**– చేర్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జీవన్ రెడ్డి**

**మద్దూరు, మన చౌరాస్తా :** ప్రజాపాలన గ్రామసభలను విజయవంతం చేసిన ప్రజలు, అధికారులకు చేర్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జీవన్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం మద్దూరు మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మేక మల్లేశం అధ్యక్షతన జరిగిన సమావేశంలో జీవన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగానే ఆరు గ్యారెంటీలను అమలుపరుస్తూ ముందుకు సాగుతుందన్నారు. ఈ గ్రామసభలో అర్హులైన వారిని గుర్తిస్తామని, అందరికీ సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందే విధంగా చూస్తామన్నారు.



## 30న జరిగే మహా ధర్నాకు

# ఇంటికొక్కరు రావాలి

చేర్యాల, మన చౌరాస్తా : చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధన కోసం ప్రతి ఒక్కరు పాటు పాటుపడాలని, చేర్యాల పట్టణ కేంద్రంలో ఈనెల 30 న జరిగే మహా ధర్నాకు ప్రతి గ్రామం నుంచి ఇంటికొక్కరుగా తరలి రావాలని రెవెన్యూ డివిజన్ జేఏసీ చైర్మన్ వకులభరణం నర్సయ్య పంతులు అన్నారు. శుక్రవారం చేర్యాల పట్టణ కేంద్రంలో ఈడెన్ గార్డెన్ లో అఖిల పక్ష నాయకులతో కలిసి మహా ధర్నాను విజయవంతం చేయాలని కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ చేర్యాల రెవెన్యూ డివిజన్ అనేది ఇక్కడి ప్రాంత ప్రజల ఆకాంక్షాన్ని అని, అందుకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం డివిజన్ అంశంపై కాలయాపన చేయకుండా గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం డివిజన్ ను ప్రకటించాలని కోరారు. ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చే కార్యక్రమంలో భాగంగా, ఈనెల 30న చేర్యాల అంబేద్కర్ సర్కిల్లో సుమారు 2000 మందితో మహా ధర్నాను నిర్వహించనున్నట్లు తెలిపారు . ఈ ధర్నాకు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు, సిపిఎం ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, తెలుగు యువత రాష్ట్ర నాయకులు పొగాకు జయ రామచందర్ తోపాటు అన్ని పార్టీల ముఖ్య నాయకులు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ముస్త్యాల బాల నర్సయ్య, సుంకరి మల్లేశం ,మెడిశెట్టి శ్రీధర్, కరుణాకర్ చంటి, ఆనంతుల మల్లేశం నాగేశ్వర్, వైస్ చైర్మన్ రాజీవ్ రెడ్డి నవీన్ రెడ్డి, బుర్ర శ్రీనివాస్ వెంకటరెడ్డి, రంజిత కృష్ణమూర్తి, మానస, సిద్ధిలింగం, తిరుపతి దాసు, బిజెపి సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షులు బోరుగు సురేష్ గౌడ్, రాందాస్, పాండు, ప్రవీణ్ ,షాదుల్ల బాలనర్సు, సిపిఎం నాయకులు కొంగర వెంకట మావో, సత్తిరెడ్డి బండ కింద అరుణ్, నాగరాజు టిడిపి నాయకులు ఒగ్గురాజు మిట్టపల్లి నారాయణరెడ్డి, రాజేందర్ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

Local News




# బాలికా విద్యతో సమాజాభివృద్ధి

## కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**జనగామ, మన చౌరాస్తా :** ఆడపిల్లలు భారం కాదని.. భవితకు సోపానమని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. శుక్రవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవం, అలాగే బేటీ బచావో బేటీ పడావో పదేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా ఘనంగా వేడుకలను నిర్వహించారు. డీసీపీ రాజ మహేంద్ర నాయక్ తో కలిసి కలెక్టర్ రిజ్వాన్ బాషా జ్యోతి ప్రజ్వలన గావించి, మిషన్ శక్తి సామర్థ్య (మహిళా సాధికారత కేంద్రం) పోస్టర్లను ఆవిష్కరించి, జాతీయ బాలికా దినోత్సవ నినాదంతో ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రథమంగా జాతీయ బాలికల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. బాలికలు నిత్యం ఎదుర్కొనే సమస్యలను అధిగమించి, జీవితంలో అభివృద్ధి దిశగా ముందుకు వెళ్లటమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. భ్రూణ హత్యల నిర్మూలనకు పుట్టిన ఆడబిడ్డకు రక్షణ కల్పించేందుకు పీసీపీఎన్డీటీ యాక్ట్ ఉందని, ఎవరైనా సరే లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అలాగే అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం అందిస్తూ బాలికల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని, ఆడపిల్లకు మెరుగైన విద్యను అందించటం కోసం కేజీబీవీలు ఉన్నాయని, వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా మహిళా ఉపాధ్యాయులు కనిపెట్టుకొని ఉంటున్నారని, అదే విధంగా బాలికల రక్షణార్థం బాల కార్మిక చట్టం, పోక్సో యాక్ట్, బాల్య వివాహాల నిషేధ చట్టం, వరకట్న నిషేధ చట్టం, గృహ హింస చట్టం ఉందని, ఒకవేళ ఎవరైనా ఈ చట్టాలను అతిక్రమిస్తే జామీను లేకుండా క్రిమినల్ కేసులు నమోదవుతాయని, పని ప్రదేశంలో మహిళలు లైగింక వేధింపులకు గురికాకుండా మహిళా సంరక్షణ కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఎవరైనా పనిచేసే చోట మహిళలతో అసభ్యంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ప్రతి ఆడపిల్ల పుట్టుక నుంచి ఉన్నత స్థాయికి చేరుకునే వరకు ఈ చట్టాలు నిరంతరం వారికి రక్షణ కల్పించేందుకు తోడ్పాటునందిస్తాయని, ఎటువంటి ఆందోళన చెందవద్దని, మహిళలు (లేదా) బాలికలకు ఏ సమస్య ఉన్నా పరిష్కరించేందుకు ఈ సఖి కేంద్రాలు కృషి చేస్తున్నాయని, ఏదైనా సమస్య ఉంటే 1098 సహాయక నంబర్ లో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డీడబ్ల్యూఓ ఫ్లోరెన్స్, డీఆర్డీఏ వసంత, డీఈఓ రమేష్, జీసీడీఓ గౌసియా బేగం, డీసీపీఓ రవికాంత్, సీడీపీఓలు రమాదేవి, సత్యవతి, ఐసీడీఎస్ సూపర్వైజర్ లు, పాఠశాలల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



# అర్హులందరికీ పథకాలు అందేలా కృషి

జనగామ, మన చౌరాస్తా : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తుందని జనగామ మార్కెట్ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ అన్నారు. శుక్రవారం జనగామ పట్టణంలోని 22, 23, 25, 26, 27, 28, 29, 30వ వార్డుల్లో జరిగిన వార్డు సభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక నిరంతరంగా ఉంటుందని, జాతాల్లో పేర్లు లేనివారు ఎవరూ ఆందోళన చెందవద్దని పేర్కొన్నారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చెంచారపు బుచ్చిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు మేడ శ్రీనివాస్, రంగరాజు ప్రవీణ్, చెంచరాపు కరుణాకర్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు బాట్ల శ్రీనివాస్, గాదెపాక రామచందర్, ఏఎంసీ డైరెక్టర్ బొట్ల నర్సింగరావు, వివిధ వార్డు అధ్యక్షులు మచ్చ ప్రవీణ్, పర్వతాలు, హర్షద్, ప్రకాష్, స్టాలిన్, గిరి, ప్రసాద్, లింగం, సాయి, శ్యామ్, యూత్ కాంగ్రెస్ నాయకులు ప్రకాష్ యాదవ్, రఘు, పృథ్వీరాజ్, శివయాదవ్, రాజశేఖర్, రమేష్, శ్రీనివాస్, సాయి, మహేష్, ప్రవీణ్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.



# కడవేర్గు పాఠశాలకు పుస్తకాల బహూకరణ

**చేర్యాల, మనచౌరాస్తా :** కడవేర్గు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రంథాలయానికి పూర్వ విద్యార్థి విశ్రాంతవైద్యులు డా పోలిరెడ్డిలక్ష్మి దంపతులు ఐదువేల రూపాయల విలువగల పుస్తకాలు బహుకరించారు. విద్యార్థులు ఉత్తమపౌరులుగా ఎదగడానికి పుస్తకాలు ఏంతో ఉపకరిస్తాయని ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు పి.ఎన్.చంద్రశేఖర్ రావు అన్నారు. దాతల సహకారంతో పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని అన్నారు. విద్యార్థులు ఈ పుస్తకాలను సద్వినియోగం చేసుకుని జ్ఞానాన్ని సంపాదించుకోవాలని సూచించారు. తదనంతరం డా పోలిరెడ్డి దంపతులను పాఠశాల తరపున ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేశ్ ,కృష్ణమూర్తి, రామకృష్ణ, లింగయ్య, కాంతికృష్ణ,మమత, అరుణ, సాజిదా,ప్రీతి, సి ఆర్ పి.రవీందర్, దినేశ్, శేఖర్ పాల్గొన్నారు.

# మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ నేతలు

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** బచ్చన్నపేట కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గంధమల్ల కిష్టయ్య తల్లి గంధమల్ల ఎల్లమ్మ అనారోగ్యంతో మృతి చెందగా కాంగ్రెస్ నాయకులు వారి కుటుంబాన్ని పరామర్శించారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పరామర్శించిన వారిలో కాంగ్రెస్ టౌన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహాత్మాచారి, కర్రే నరేష్, నల్లగోని బాలకిషన్ గౌడ్, ఆల్వాల ఎల్లయ్య, కూరాకుల రవి, అల్వాల రమేష్, అవదూత శ్రీనివాస్, గుర్రపు బాలరాజు, దాచిపల్లి రాజయ్య, మధు సుధన్ రెడ్డి, సూత్రమేని రామకృష్ణ, విజయ భాస్కర్, బండారు మల్లయ్య, కర్రే లక్ష్మయ్య, గంధమల్ల ప్రవీణ్, రాగిషెట్టి అబ్బసాయిలు ఉన్నారు.

# ఆన్‌లైన్ డేటా నమోదు ఎంతో కీలకం

## అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్



**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా** : జిల్లాలోని ఘనపూర్ (స్టేషన్) నియోజకవర్గం జాఫర్గడ్ మండలంలోని ఎంపిడిఓ కార్యాలయాల్లో కొనసాగుతోన్న రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా సర్వే పరిశీలన అభ్యంతరాల దరఖాస్తుల ఆన్‌లైన్ డేటా నమోదు తీరును జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ సభల్లో వచ్చిన ప్రతి దరఖాస్తు వివరాలను ఆన్లైన్ లో నమోదు చేయాలని, అర్హులకు ఈ సంక్షేమ పథకాలను అందించేందుకు గాను సదరు దరఖాస్తులను ఆన్లైన్ లో నమోదు చేయడం ఎంతో కీలకమని, ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా అత్యంత జాగ్రత్తగా వివరాలను ఆన్లైన్ లో సంక్షిప్తం చేయాలని సూచించారు. పరిశీలనలో ఎంపిడిఓలు విజయశ్రీ, సుమన్, తహసీల్దార్లు వెంకటేశ్వర్లు, శంకరయ్య, ఇతర సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.



# పేరుకే సీరియల్ నటి.. ఆస్తి రూ.250 కోట్లట!

చాలా మంది హీరోయిన్స్ ఇప్పుడు హీరోలకు మించి క్రేజ్ తెచ్చుకుంటున్నారు. కొంతమంది హీరోయిన్స్ కోసమే సినిమాలకు వెళ్లే వారు కూడా ఉన్నారు. రీసెంట్ డేస్ లో చాలా మంది ముద్దుగుమ్మలు ఓవర్ నైట్ లో స్టార్స్ గా మారిపోయారు. దాంతోపాటు వరుస సినిమాలతో ఫుల్ బిజీగా గడిపేస్తున్నారు. కొంతమంది హీరోయిన్స్ స్టార్ హీరోలకు సమానంగా రెమ్యునరేషన్ అందుకుంటూ వార్తల్లో నిలుస్తున్నారు. సినిమా హీరోయిన్స్ మాత్రమే కాదు సీరియల్ బ్యూటీలు కూడా ఈ మధ్య తెగ ఫేమస్ అవుతున్నారు. హీరోయిన్స్ ను మించి క్రేజ్ తెచ్చుకున్న భామలు కూడా చాలా మంది ఉన్నారు. తాజాగా ఓ సీరియల్ బ్యూటీ సోషల్ మీడియాలో ఓ రేంజ్ లో క్రేజ్ తెచ్చుకుంది. ఎంతలా అంటే అంతా ఇంతా కాదు ఏకంగా స్టార్ హీరోలకు మించి ఫాలోవర్స్ ఉన్నారు ఆ అమ్మడికి.. అలాగే ఆమె ఆస్తిపాస్తులు కూడా స్టార్ హీరోలకు మించి ఉన్నాయి. ఇంతకూ ఆమె ఎవరంటే.. ఆమె వయసు కేవలం 23 ఏళ్లు మాత్రమే.. కానీ ఆమె ఆస్తి మాత్రం రూ. 250 కోట్లకు పైగానే ఉంది. స్టార్ హీరోయిన్స్ కూడా ఇంత సంపాదించలేదు. అంతే కాదు ఇండస్ట్రీలో అత్యధిక రెమ్యునరేషన్ తీసుకుంటున్న సీరియల్ నటి ఆమె. ఇంతకూ ఆమె పేరు ఏంటంటే.. ఆ సీరియల్ బ్యూటీ ఎవరో కాదు.. బాలీవుడ్ నటి జన్నత్ జుబేర్. చిన్న వయసులోనే ఈ అమ్మడు తిరుగులేని స్టార్ డమ్ సొంతం చేసుకుంది. సోషల్ మీడియాలో ఈ చిన్నదానికి విపరీతమైన క్రేజ్ ఉంది. ఆమెను ఫాలో అయ్యే వారు మిలియన్స్ లో ఉన్నారు. ఫాలోవర్స్ లో షారుక్ ఖాన్ ను కూడా బీట్ చేసింది ఈ చిన్నది. జన్నత్ జుబేర్ కు ఇన్ స్టాలో ఇన్‌స్టాగ్రామ్‌లో ఏకంగా 49.7 మిలియన్ల మంది ఫాలోవర్లు ఉన్నారు. చైల్డ్ ఆర్టిస్ట్‌గా టీవీ ఇండస్ట్రీలో కెరీర్ స్టార్ట్ చేసిన ఈ ముద్దుగుమ్మ ఇప్పుడు బాలీవుడ్ లో స్టార్ గా మారిపోయింది. బాలీవుడ్ లో ఎన్నో సీరియల్స్ లో నటించి మెప్పించింది ఈ ముద్దుగుమ్మ ఆలాగే రాణి ముఖర్జీ హీరోయిన్‌గా నటించిన 'హిచ్కీ'లో జన్నత్ యాక్ట్ చేసింది. సీరియల్స్ తో పాటు పలు టీవీ షోల్లోనూ నటించి ఆకట్టుకుంటుంది. ఇక జన్నత్ సోషల్ మీడియాలో షేర్ చేసే ఫోటోలకు విపరీతమైన క్రేజ్ ఉంది. ఆమె ఒక్క ఫోటో షేర్ చేస్తే చాలు సోషల్ మీడియా షేక్ అవ్వాల్సిందే..!